




# మసూద్ అజర్ కుటుంబంలో 10 మంది హతం

- ధ్రువీకరించిన జైషే మహమ్మద్ నేత
- బహవల్‌పూర్‌లో జైషే స్థావరంపై భారత్ దాడి
- 26 మంది మృతి, 46 మందికి గాయాలు
- వెల్లడించిన పాకిస్థాన్ సైన్యం



లాహోర్, మే 7: పహల్గాం ఘటనకు ప్రతీకారంగా భారత్ జరిపిన వైమానిక దాడిలో తన కుటుంబ సభ్యులు 10 మంది హతమయ్యారని జైషే మహమ్మద్ ఉగ్రవాద సంస్థ అధిపతి మసూద్ అజర్ అంగీకరించాడు. పాక్‌లోని బహవల్‌పూర్‌లోగల జైషే మహమ్మద్ ప్రధాన కార్యాలయం లక్ష్యంగా భారత్ జరిపిన దాడిలో తన కుటుంబ సభ్యులతోపాటు సన్నిహిత సహచరులు మరో నలుగురు కూడా మరణించారని తెలిపాడు. బహవల్‌పూర్‌లోని జామియా మస్జిద్ సుభాన్ అల్లాహ్‌పై జరిగిన దాడిలో తన అక్క, ఆమె భర్త, వారి కుమారుడు, కోడలు, మరో కుమార్తె, ఐదుగురు పిల్లలు మరణించారని మసూద్ అజర్ ఒక ప్రకటనలో వెల్లడించాడు. ఈ దాడిలో తన అత్యంత సన్నిహిత సహచరుడు అతని తల్లి, మరో ఇద్దరు సహచరులు కూడా హతమయ్యారని పేర్కొన్నాడు. 'ఈ క్రూరమైన చర్య అన్ని హద్దులను ఉల్లంఘించింది. ఇకపై దయ చూపించకూడదు' అని ఆ ప్రకటనలో వ్యాఖ్యానించాడు. బహవల్‌పూర్‌పై జరిగిన దాడిలో 26 మంది మరణించారని, 46 మంది గాయపడ్డారని పాక్ మిలిటరీ ప్రకటించింది. ఇండియన్ ఎయిర్‌లైన్స్‌కు చెందిన ఐసీ-814 విమానాన్ని 1999లో కాందహార్‌కు హైజాక్ చేసిన ఉగ్రవాదులు ప్రయాణికులను విడిచిపెట్టేందుకు బదులుగా భారత జైలులో మసూద్ అజర్‌ను విడిచిపెట్టాలని షరతు విధించిన సంగతి తెలిసిందే. అప్పుడు జైలు నుంచి విడుదలై పాకిస్థాన్‌కు పారిపోయిన మసూద్ అజర్ బహవల్‌పూర్‌ను స్థావరంగా చేసుకొని జైషే మహమ్మద్ ఉగ్రవాద సంస్థను స్థాపించాడు. ఐక్యరాజ్యసమితి 2019, మే నెలలో మసూద్ అజర్‌ను అంతర్జాతీయ ఉగ్రవాదిగా ప్రకటించింది. 2019 ఏప్రిల్ తరువాత ఇంతవరకు బహిరంగంగా ఎక్కడా కనిపించని అజర్ బహవల్‌పూర్‌లోని 'సురక్షిత ప్రాంతం'లో తలదాచుకుంటున్నట్టు సమాచారం.

### హఫీజ్ సయీద్ కొడుకు తల్హా సయీద్ హతం?

ఆపరేషన్ సిందూర్‌లో భాగంగా భారత వైమానిక దళం పాక్‌లోని ముజఫరాబాద్‌లో ఉగ్రవాద సంస్థ లష్కరే తాయిబాకు చెందిన శిక్షణా శిబిరంపై మిస్సైల్ దాడి జరిపింది. ఈ దాడిలో లష్కరే తాయిబా వ్యవస్థాపకుడు హఫీజ్ సయీద్ కుమారుడు తల్హా సయీద్ కూడా హతమైనట్టు భావిస్తున్నారు. లష్కరేకు చెందిన ఈ శిక్షణా కేంద్రానికి తల్హా సయీద్ పర్యవేక్షకునిగా ఉన్నట్టు సమాచారం. భారత్ జరిపిన దాడిలో తల్హా సయీద్‌తోపాటు లష్కరేకు చెందిన ఐదుగురు టాప్ కమాండర్లు కూడా మరణించారని పాక్ అధికార వర్గాలు పేర్కొన్నాయి. పహల్గాం ఉగ్రదాడి వెనుక మాస్టర్‌మైండ్‌గా పేర్కొంటున్న అబ్దుల్ రెహమాన్ కూడా ఈ దాడిలో మరణించినట్టు అనుమానిస్తున్నారు. క్షిపణి దాడిలో లష్కరే శిక్షణా కేంద్రం నేలమట్టమైందని ఓ సైన్యాధికారి తెలిపారు. 'ఇది ప్రతీకాత్మక దాడి కాదు, నిర్ణయాత్మక సందేశం' అని ఆ సైన్యాధికారి వ్యాఖ్యానించారు. అయితే తల్హా సయీద్ మృతిపై అధికారిక సమాచారం వెలువడలేదు. 2023లో హఫీజ్ సయీద్ నిర్బంధం తరువాత లష్కరే కార్యకలాపాల్లో, ఆర్థిక వ్యవహారాల్లో తల్హా సయీద్ కీలకంగా మారాడు. ఒకవేళ అతడు ఈ దాడిలో మృతి చెంది ఉంటే లష్కరే అది తీరని నష్టాన్ని చేకూరుస్తుందని భావిస్తున్నారు.

# సరిహద్దు గ్రామాలపై పాక్ కాల్పులు

**12 మంది భారత పౌరుల మృతి**

- 57 మందికిపైగా గాయాలు
- భారత జవాన్ వీరమరణం
- పాక్ కాల్పులకు భారత్ దీటైన జవాబు

జమ్ము/శ్రీనగర్, మే 7: జమ్ము కశ్మీరులోని నియంత్రణ రేఖ (ఎల్‌ఓసీ) వెంబడి సరిహద్దు గ్రామాలపై పాకిస్థాన్ సైన్యం విచక్షణారహితంగా జరిపిన కాల్పులలో నలుగురు పిల్లలు, ఇద్దరు మహిళలతోసహా 12 మంది మరణించగా మరో 57 మంది గాయపడ్డారు. పాకిస్థాన్‌లోని, పాక్ ఆక్రమిత కశ్మీరులోని 9 ఉగ్రవాద స్థావరాలపై భారత సాయుధ దళాలు దాడులు జరిపిన తర్వాత పాకిస్థాన్ సైన్యం ఎల్‌ఓసీ వెంబడి ఉన్న భారత గ్రామాలపై భారీగా కాల్పులు జరిపినట్లు బుధవారం అధికారులు తెలిపారు. పాక్ సైనిక బలగాల కాల్పులకు భారత సైన్యం దీటుగా జవాబిస్తున్నట్లు వారు చెప్పారు. కాల్పులకు తెగబడిన పాక్ సైనిక పోస్టులను భారత బలగాలు ధ్వంసం చేయడంతో శత్రు పక్షంలో కూడా భారీ సంఖ్యలో మరణాలు సంభవించినట్లు వారు చెప్పారు.

### మృతులంతా పూంచ్ వాసులే

పాకిస్థానీ కాల్పులలో పూంచ్ జిల్లా బాగా నష్టపోయిందని, మృతి చెందిన పౌరులంతా ఇక్కడి వారేనని అధికారులు తెలిపారు. 50 మందికి పైగా పౌరులు కూడా గాయపడ్డారని, వారిలో కొందరి పరిస్థితి విషమంగా ఉందని అధికారులు పేర్కొన్నారు. పాకిస్థాన్ బలగాలు విచక్షణారహితంగా జరిపిన కాల్పులలో భీతిల్లిన సరిహద్దు గ్రామాల ప్రజలు భూగర్భ బంకర్లలోకి కొందరు, తమ గ్రామాల బయట సురక్షిత ప్రదేశాలలో మరికొందరు తలదాచుకున్నారు. నియంత్రణ రేఖ, అంతర్జాతీయ సరిహద్దు వెంబడి నివసించే వందలాది మంది పౌరులను అధికారులు బుధవారం సురక్షిత ప్రదేశాలకు తరలించారు.

### ఇళ్లు, వాహనాలు ధ్వంసం

ఎల్‌ఓసీ వెంబడి ఉన్న బాలాకోట్, మెంధర్, మన్‌కోటే, కృష్ణ ఘాటి, గుల్పూర్, కేర్నితోపాటు పూంచ్ జిల్లా ప్రధాన కార్యాలయంపై కూడా పాక్ సేనలు కాల్పులకు తెగబడ్డాయని అధికారులు తెలిపారు. ఈ కాల్పులలో అనేక ఇళ్లు, వాహనాలు ధ్వంసమయ్యాయని వారు చెప్పారు. బారాముల్లా జిల్లాలోని యూరీ సెక్టార్‌లో సరిహద్దు అవతల నుంచి జరిగిన కాల్పులలో ముగ్గురు మైనర్ పిల్లలతోసహా 10 మంది గాయపడ్డారు. రాజౌరీ జిల్లాలో ముగ్గురు గాయపడ్డారని అధికారులు తెలిపారు. కుప్వారా జిల్లాలోని కర్నాహ్ సెక్టార్‌లో పాక్ దాడిలో పలు ఇళ్లు మంటల్లో చిక్కుకున్నాయని వారు చెప్పారు. ఉదయం సరిహద్దుల అవతల నుంచి భారీ స్థాయిలో జరిగిన కాల్పులు మధ్యాహ్నానికి తగ్గాయని, ప్రస్తుతం పూంచ్ సెక్టార్‌కే పరిమితమయ్యాయని తెలిపారు.



ఉరి సెక్టార్‌లోని సల్మాబాద్ వద్ద పాక్ కాల్పుల్లో దెబ్బతిన్న ఇల్లు

### క్షతగాత్రుల తరలింపులో ఇబ్బందులు

పాక్ విచక్షణారహితంగా జరుపుతున్న కాల్పుల మధ్య క్షతగాత్రులను దవాఖానలకు తరలించడం స్థానికులకు ఇబ్బందిగా మారింది. మంగళవారం-బుధవారం మధ్య రాత్రిలో ఎల్‌ఓసీ, అంతర్జాతీయ సరిహద్దు వెంబడి ఉన్న పోస్టుల నుంచి పాకిస్థానీ బలగాలు ఏకపక్షంగా కాల్పులు జరిపినట్లు రక్షణ శాఖ ప్రతినిధి ఒకరు తెలిపారు. భారత సైన్యం తగిన విధంగా స్పందిస్తున్నట్లు ఆయన చెప్పారు. పాక్ కాల్పులకు ప్రతీకార చర్యగా భారత బలగాలు జరిపిన కాల్పులలో శత్రు సేనలో భారీ సంఖ్యలో నష్టం వాటిల్లినట్లు సైనిక వర్గాలు తెలిపాయి. జమ్ము ప్రాంతంలోని ఐదు సరిహద్దు జిల్లాలలో బుధవారం అన్ని విద్యా సంస్థలకు అధికారులు సెలవు ప్రకటించారు. ప్రస్తుత పరిస్థితి దృష్ట్యా జమ్ము, సంబా, కథువా, రాజౌరీ, పూంచ్‌లోని అన్ని స్కూళ్లు, కాలేజీలను బుధవారం మూసివేసినట్లు డివిజనల్ కమిషనర్ రమేష్ కుమార్ ఎక్స్ వేదికగా తెలిపారు. పంజాబ్, రాజస్థాన్‌లోని సరిహద్దు జిల్లాల్లో కూడా పాఠశాలలు మూసివేశారు.

## 25 విమానాశ్రయాలు తాత్కాలిక మూసివేత

- 300కుపైగా విమాన సర్వీసులు రద్దు

న్యూఢిల్లీ, మే 7: బుధవారం తెల్లవారుజామున పాకిస్థాన్‌పై భారత్ క్షిపణి దాడులకు దిగటంతో దేశవ్యాప్తంగా పలు విమానాశ్రయాల్లో విమాన రాకపోకలు రద్దయ్యాయి. శ్రీనగర్, లేహ్, జమ్ము సహా 25 నగరాల్లోని విమానాశ్రయాల్ని తాత్కాలికంగా మూసివేశారు. ఎయిర్ ఇండియా, ఇండిగో, స్పైస్‌జెట్, ఎయిర్ ఇండియా తదితర సంస్థలు నడుపుతున్న 300కుపైగా ఫ్లైట్స్ రద్దు అయ్యాయి. దేశంలో అత్యంత రద్దీతో కూడిన ఢిల్లీ ఎయిర్‌పోర్ట్‌లో కనీసం 35 విమానాలు రద్దు అయినట్టు అధికార వర్గాలు తెలిపాయి. ఢిల్లీ నుంచి పాకిస్థాన్‌కు వెళ్లే విమానాలు రద్దు చేసినట్టు ఖతార్ ఎయిర్‌వేస్ 'ఎక్స్'లో ప్రకటించింది. జమ్ము, శ్రీనగర్, లేహ్, జోద్‌పూర్, పఠాన్‌కోట్, జైసల్మేర్, సిమ్లా, ధర్మశాల, అమృత్‌సర్, భుజ్, జామ్‌నగర్, చండీగఢ్, రాజ్‌కోట్‌లలోని విమానాశ్రయాలు తాత్కాలికంగా మూసివేయటంతో, ఈ నగరాలకు ప్రయాణించే విమానాలను మే 10 వరకు రద్దు చేస్తున్నట్టు ఎయిర్ ఇండియా ఒక ప్రకటనలో తెలిపింది. టికెట్ క్యాన్సల్ చేసుకున్న వారికి పూర్తి మొత్తం రిఫండ్ చేస్తామని అన్నారు.

# గట్టి జవాబిస్తాం

- పాకిస్థాన్ ప్రధాని షెహబాజ్ షరీఫ్
- ప్రతీకార దాడులుంటాయని ప్రకటన
- సైన్యానికి పూర్తి స్వేచ్ఛ ఇచ్చిన ప్రభుత్వం

హైదరాబాద్, మే 7 (నమస్తే తెలంగాణ): శత్రువుకు ఎలా జవాబు చెప్పాలో తమ సైన్యానికి తెలుసు అని పాకిస్థాన్ ప్రధాన మంత్రి షెహబాజ్ షరీఫ్ పేర్కొన్నారు. భారత్ చేపట్టిన యుద్ధ చర్యకు దీటుగా జవాబు చెప్పే హక్కు పాకిస్థాన్‌కు ఉన్నదని చెప్పుకున్నారు. ప్రధాని షెహబాజ్ నేతృత్వంలోని నేషనల్ సెక్యూరిటీ కమిటీ (ఎన్‌ఎస్‌సీ) బుధవారం అత్యవసరంగా సమావేశం అయ్యింది. ఈ సందర్భంగా భారత్‌పై ప్రతీకార దాడికి సైన్యానికి పూర్తి స్వేచ్ఛను ఇస్తూ నిర్ణయం తీసుకున్నారు. ప్రస్తుత పరిస్థితి నుంచి భారత్ వెనక్కు తగ్గితే.. ఉభయ దేశాల మధ్య ఏర్పడిన ఉద్రిక్తతను తగ్గించేందుకు పాకిస్థాన్ సిద్ధంగా ఉన్నదని ఆ దేశ రక్షణ మంత్రి ఖవాజా ఆసిఫ్ పేర్కొన్నారు. భారత్ పట్ల తాము శత్రు భావంతో వ్యవహరించబోమని తాము గత పక్షం రోజులుగా చెప్తున్నామని పేర్కొన్నారు. మరోవైపు భారత్ దాడుల్లో మరణించిన లష్కరే తాయిబా ఉగ్రవాదుల అంత్యక్రియల్లో పాకిస్థాన్ పంజాబ్ రాష్ట్ర ఐజీపీ, ఇతర పోలీసులు, సైనికాధికారులు పాల్గొన్నారు.



భారత్ జరిపిన దాడిలో మరణించిన ఉగ్రవాదులకు నివాళులర్పిస్తున్న పాకిస్థాన్ సైనికులు

# పాకిస్థాన్ ఉక్కిరిబిక్కిరి!

- భారత సైన్యం దాడులతో కకావికలం
- గిల్గిట్, బాల్టిస్థాన్‌లో ఎమర్జెన్సీ
- సైన్యానికి సెలవులు రద్దు

హైదరాబాద్, మే 7 (నమస్తే తెలంగాణ): ఉగ్రస్థావరాలపై భారత్ దాడుల నేపథ్యంలో పాకిస్థాన్ ప్రభుత్వం దేశవ్యాప్తంగా హై అలర్ట్ ప్రకటించింది. సైన్యానికి సెలవులు రద్దు చేసింది. ప్రభుత్వ విభాగాలు అప్రమత్తంగా ఉండాలని ఆదేశించింది. పంజాబ్, గిల్గిట్ బాల్టిస్థాన్ ప్రావిన్స్‌ల్లో ఎమర్జెన్సీ ప్రకటించింది. తాజా ఉద్రిక్తతల నేపథ్యంలో లాహోర్ గగనతలాన్ని 24 గంటలపాటు మూసేస్తున్నట్టు ప్రభుత్వం బుధవారం ప్రకటించింది.

### ప్రజల్లో తీవ్ర ఆందోళన

తాజా ఉద్రిక్తతల నేపథ్యంలో పాకిస్థాన్ ప్రజల్లో తీవ్ర ఆందోళన నెలకొన్నది. వాళ్లు ఇప్పటికే భారీగా నిత్యావసరాలను కొనుగోలు చేసి నిల్వ చేస్తుండగా, బుధవారం దాడులతో ఇది మరింత పెరిగింది. నగదు కోసం ఏటీఎంల ముందు ప్రజలు బారులు తీరుతున్నట్టు పాకిస్థాన్‌కు చెందిన పలు మీడియా సంస్థలు పేర్కొంటున్నాయి. మరోవైపు తాజా పరిస్థితుల నేపథ్యంలో బుధవారం పాకిస్థాన్ నుంచి అన్ని అంతర్జాతీయ విమాన సర్వీసులను రద్దు చేశారు. దీంతో విమానాశ్రయాల్లో భారీగా ప్రయాణికులు ఇరుక్కుపోయారు. తిరిగి సర్వీసుల ప్రారంభం సమాచారం లేదని వాపోతున్నారు.

## పారా మిలిటరీ సిబ్బంది సెలవులు రద్దు

- కేంద్రసాయుధ పోలీసు బలగాల చీఫ్‌లకు అమిత్ షా ఆదేశం

న్యూఢిల్లీ, మే 7: భారత సైన్యం 'ఆపరేషన్ సిందూర్' చేపట్టిన నేపథ్యంలో, దేశవ్యాప్తంగా అంతర్గత భద్రతపై కేంద్ర హోంమంత్రి అమిత్ షా కీలక ఉత్తర్వులు జారీచేశారు. సెలవులపై వెళ్లిన సిబ్బందిని వెనక్కి రప్పించాలని పారామిలిటరీ బలగాల చీఫ్‌లను ఆయన ఆదేశించారు. బుధవారం కేంద్ర ప్రభుత్వ వర్గాలు ఈ మేరకు ఒక ప్రకటన విడుదల చేశాయి. ఆపరేషన్ సిందూర్ నేపథ్యంలో దేశ అంతర్గత భద్రతపై అమిత్ షా సమీక్ష నిర్వహించారని, ఉన్నతాధికారులందరూ అప్రమత్తంగా ఉండాలని, కఠినమైన నిఘా చేపట్టాలని ఆ సమావేశంలో అమిత్ షా వారిని కోరారు. అలాగే దేశ సరిహద్దు ప్రాంతాల్లో నివసిస్తున్న జమ్ము కశ్మీర్ ప్రజలను సురక్షిత ప్రాంతాలకు తరలించాలని ఆ రాష్ట్ర ఎల్జీ మనోజ్ సిన్హా, సీఎం ఒమర్ అబ్దుల్లాకు అమిత్ షా సూచించారు.

## మిలిటరీ రైళ్లపై పాక్ నిఘా?

న్యూఢిల్లీ : సైనికులు ప్రయాణించే రైళ్ల వివరాలను పాకిస్థాన్ నిఘా వర్గాలు తెలుసుకునేందుకు ప్రయత్నించే అవకాశం ఉందని రైల్వే మంత్రిత్వ శాఖ హెచ్చరించింది. ఇది రహస్య సమాచారమని, దీనిని అనధికారిక వ్యక్తులకు తెలియజేయవద్దని రైల్వే ఉద్యోగులను హెచ్చరించింది. ఈ సమాచారాన్ని బయటపెట్టడం వల్ల దేశ భద్రతకు తీవ్రమైన ముప్పు వాటిల్లుతుందని చెప్పింది. ఈ నెల 6న ఈ మేరకు ఓ అడ్వయిజరీని జారీ చేసింది. రైల్వే బోర్డు అన్ని రైల్వే జోన్ల ప్రిన్సిపల్ చీఫ్ ఆపరేషన్ మేనేజర్లకు ఈ సందేశాన్ని పంపించింది. రైల్వేలోని సైనిక విభాగం 'మిల్ రైల్'కు మినహా ఇతరులకు ఈ సమాచారాన్ని ఇవ్వవద్దని స్పష్టం చేసింది.

## మోదీ యూరప్ పర్యటన రద్దు

న్యూఢిల్లీ : ప్రధాన మంత్రి నరేంద్ర మోదీ యూరప్ పర్యటన రద్దయింది. ఆయన ఈ నెల 13 నుంచి 17 వరకు క్రొయేషియా, నార్వే, నెదర్లాండ్స్‌లో పర్యటించవలసి ఉంది. విశ్వసనీయ సమాచారం ప్రకారం, భారత్, పాక్‌ల మధ్య ఉద్రిక్తతల నేపథ్యంలో ఈ పర్యటన రద్దయింది. ఆయా దేశాలకు ఈ సమాచారాన్ని అధికారులు తెలియజేశారు.

# దోవల్ ఆపరేషన్ సక్సెస్!

- 'ఆపరేషన్ సిందూర్'లో కీలకంగా జాతీయ భద్రత సలహాదారు
- పహల్గాం ఉగ్ర దాడి అనంతరం ప్రధాని మోదీతో వరుస భేటీలు
- 'ఆపరేషన్ సిందూర్' ప్లానింగ్, దళాల సమన్వయం నుంచి దాడుల తర్వాత విదేశీ ప్రతినిధుల మద్దతును కూడగట్టడంలోనూ ఆయనే కీలకం



(స్పెషల్ టాస్క్ బ్యూరో)

హైదరాబాద్, మే 7 (నమస్తే తెలంగాణ): పహల్గాం ఉగ్రదాడికి ప్రతీకార చర్యగా భారత త్రివిధ దళాలు చేపట్టిన 'ఆపరేషన్ సిందూర్'ను ముందుండి నడిపించడంలో జాతీయ భద్రత సలహాదారు అజిత్ దోవల్ కీలక పాత్ర పోషించారు. ఆపరేషన్‌లో భాగంగా త్రివిధ దళాల మధ్య సమన్వయం ఏర్పాటు చేయడమే కాకుండా ఆపరేషన్ పూర్తయ్యాక విదేశీ ప్రతినిధుల నుంచి వచ్చే దౌత్యపరమైన ప్రశ్నలను నివృత్తి చేస్తూ వారి మద్దతును కూడగట్టడంలోనూ ఆయన కీలకంగా వ్యవహరించారు.

### దాడి జరిగిన రోజు నుంచే..

గత నెల 22న కశ్మీర్‌లోని పహల్గాంలో ఉగ్రదాడి ఘటన జరిగిన క్షణం నుంచి భద్రతాపరమైన చర్యలను పర్యవేక్షించడంతోపాటు ఉగ్రమూకల ఆటకట్టించడానికి అవసరమైన పథకాలు రచించడంలోనూ దోవల్ ముఖ్య భూమిక పోషించారు. ఉగ్ర శిబిరాలపై దాడి చేయడానికి ఒకరోజు ముందు ప్రధాని మోదీతో దోవల్ రెండుసార్లు భేటీ అయ్యారు. ఒక్కో భేటీలో గరిష్ఠంగా 40 నిమిషాల పాటు ఏకాంతంగా చర్చలు జరిపారు. 24 గంటల వ్యవధిలో జరిగిన ఈ రెండు సమావేశాల్లోనే 'ఆపరేషన్ సిందూర్'కు సంబంధించిన నిర్ణయం జరిగి ఉండొచ్చని సమాచారం. బుధవారం దేశవ్యాప్తంగా చేపట్టిన మాక్ సెక్యూరిటీ డ్రిల్స్‌ను కూడా దోవల్ పర్యవేక్షించారు.

### విదేశీ ప్రతినిధులతో..

ఆపరేషన్ సిందూర్ తీరుతెన్నులను, ఏ పరిస్థితుల్లో ఈ ఆపరేషన్‌ను చేపట్టాల్సి వచ్చిందన్న విషయాన్ని విదేశీ ప్రతినిధులకు, ఆయా దేశాల భద్రతా సలహాదారులకు, కార్యదర్శులకు వివరించడంలో దోవల్ విజయం సాధించారు. ఈ క్రమంలోనే అమెరికా, బ్రిటన్, సౌదీ అరేబియా, జపాన్, రష్యా, ఫ్రాన్స్ తదితర దేశాల ప్రతినిధులు భారత్ చర్యలను సమర్థించాయి. ఉగ్రవాదాన్ని నిర్మూలించాల్సిందేనని ప్రకటించాయి. మరోవైపు, ఉగ్ర శిబిరాలపై మాత్రమే తాము దాడులు చేశామని.. పాక్ ఆర్థిక, సైనిక స్థావరాలపై దాడి చేయలేదని అజిత్ దోవల్ ప్రత్యేకంగా వివరించారు. దీనికి అవసరమైన రుజువులను మీడియా సమావేశంలో విదేశాంగ శాఖ ద్వారా ప్రదర్శించేలా చేశారు. తద్వారా అంతర్జాతీయ వేదికల మీద దాయాది దేశం భారత్‌ను దోషిగా చిత్రీకరించే కుట్రలకు చెక్ పెట్టేలా చేశారు. ఇదే సమయంలో ఉద్రిక్తతలను పెంచే ఉద్దేశం తమకు ఎంతమాత్రమూ లేదన్న దోవల్.. పరిస్థితులను తీవ్రతరం చేసేలా పాక్ వ్యవహరిస్తే.. భారత్ నుంచి ప్రతిస్పందన మరింత గట్టిగా ఉంటుందని హెచ్చరికలు కూడా జారీ చేశారు.

### గతంలో కూడా..

2019లో పుల్వామా దాడుల అనంతరం నిర్వహించిన బాలాకోట్ ఎయిర్ స్ట్రైక్స్ ఆపరేషన్‌లోనూ దోవల్ కీలక పాత్ర పోషించారు. 1988లో ఇరాక్‌లో చిక్కుకొన్న 46 మంది భారత పౌరులను రక్షించడానికి నిర్వహించిన ఆపరేషన్ బ్లాక్ థండర్, 2015లో మయన్మార్ సరిహద్దుల్లో చేపట్టిన ఆపరేషన్ హాట్ పర్స్యూట్‌లోనూ ఆయన కీలకంగా వ్యవహరించారు. పాకిస్థాన్‌లో ఏడాదిపాటు గూఢచారిగా ఉంటూ దోవల్ భారత్‌కు విలువైన సమాచారాన్ని చేరవేశారు.

# పాక్ దుష్ప్రచారం.. చైనాకు లాభం!

- భారత యుద్ధ విమానాలు కూల్చామన్న పాక్
- పాక్ ప్రభుత్వాధినేతలు, సైనికాధికారుల పొంతనలేని ప్రకటనలు
- చైనా తయారీ విమానాలతోనే అడ్డుకున్నామని ప్రచారం
- ఇదే అదనుగా 17 శాతం పెరిగిన చైనా కంపెనీ షేర్ ధర

హైదరాబాద్, మే 7 (నమస్తే తెలంగాణ): భారత్ దాడులతో ఉక్కిరిబిక్కిరైన పాకిస్థాన్.. అంతర్జాతీయంగా తన పరువు కాపాడేందుకు భారత్‌పై అసత్యాలను ప్రచారం చేయడం ప్రారంభించింది. తాము భారత్‌కు చెందిన ఐదు యుద్ధ విమానాలను కూల్చేశామని ప్రకటించింది. వాటిలో మూడు రాఫెల్ యుద్ధ విమానాలు, ఒక ఎస్‌యూ 30, ఒక మిగ్ 29 ఉన్నాయని ప్రచారం చేసింది. అయితే ఈ విషయంలో పాక్ ప్రభుత్వాధినేతలు, సైనికాధికారుల మధ్య ఏకాభిప్రాయం కనిపించలేదు. తాము కనీసం రెండు విమానాలను కూల్చేశామని ఆర్మీ అధికార ప్రతినిధి అహ్మద్ షరీఫ్ చౌదరి ప్రకటించగా, ఆరు విమానాలను కూల్చేశామని పాక్ ఆర్మీ ఆ దేశ మీడియాకు లీకులు ఇచ్చింది. భారత్ తమపై 75-80 విమానాలతో దాడులు చేసిందని, అందులో ఐదింటిని కూల్చేశామని పాక్ ప్రధాని పార్లమెంట్‌లో చెప్పారు. అయితే ఇందుకు సంబంధించి పాక్ ప్రభుత్వం బలమైన ఒక్కఆధారం కూడా చూపలేదు. కేవలం ఒక యుద్ధ విమానం రెక్కలోని ఒక భాగం ఫొటోను చూపుతూ, పాంపోర్ జిల్లాలో కూలిపోయిన భారత యుద్ధవిమాన శకలం అని ప్రచారం చేస్తున్నది. ఒక విమానం ఇంజిన్ మంటల్లో చిక్కుకున్న వీడియోను సైతం సోషల్ మీడియాలో వైరల్ చేస్తున్నది. అయితే ఇది 2021లో కూలిపోయిన మిగ్ 29 విమానానికి సంబంధించిన వీడియో అని భారత సైన్యం ఆధారాలతో సహా బయటపెట్టింది. మరోవైపు.. పాక్ చేసి న ఈ దుష్ప్రచారంతో చైనాకు చెందిన కంపె నీ లాభపడటం విశేషం. చైనాకు చెందిన జే-10, జేఎఫ్-17 విమానాల సాయంతో నే భారత యుద్ధ విమానాలను కూల్చేసిన ట్టు పాక్ ప్రచారం చేసింది. దీంతో ఈ విమానాలను తయారు చేస్తున్న చైనా కంపెనీ 'చెంగ్డు ఎయిర్ క్రాఫ్ట్ కార్పొరేషన్' (సీఏసీ) షేర్ల ధరలు బుధవారం ఒక్క రోజే 18 శాతం పెరిగినట్టు మార్కెట్ వర్గాలు తెలిపాయి.

## రాష్ట్రపతి ముర్ముతో మోదీ భేటీ

- ఆపరేషన్ సిందూర్‌పై వివరణ
- ధోవల్, రాజ్‌నాథ్‌లోనూ మోదీ వేర్వేరుగా సమావేశం

న్యూఢిల్లీ: పాకిస్థాన్, పాక్ ఆక్రమిత కశ్మీరులోని ఉగ్రవాద స్థావరాలపై భారత సాయుధ దళాలు దాడులు నిర్వహించిన తర్వాత ప్రధాని నరేంద్ర మోదీ బుధవారం రాష్ట్ర ద్రౌపది ముర్మును కలుసుకుని దాడుల గురించి వివరించారు. మరోవైపు, ఎన్ఎస్ఏ చీఫ్ అజిత్ ధోవల్, రాజ్‌నాథ్ సింగ్‌తో ప్రధాని మోదీ వేర్వేరుగా సమావేశమయ్యారు. ఆపరేషన్ సిందూర్ నేపథ్యంలో నెలకొన్న పరిస్థితిని వారు ప్రధాని మోదీకి తెలియజేసినట్టు సమాచారం. మరోవైపు, పాక్, నేపాల్ సరిహద్దు రాష్ట్రాల ముఖ్యమంత్రులు, డీజీపీలు, ప్రభుత్వ ప్రధాన కార్యదర్శులతో కేంద్ర హోం మంత్రి అమిత్ షా సమావేశమయ్యారు. మన సరిహద్దులు, సైన్యం, ప్రజలను సవాల్ చేసినవారికి భారత దేశం దీటుగా సమాధానం చెప్పిందని అమిత్ షా ఈ సమావేశంలో చెప్పారు. ఉగ్రవాదుల స్థావరాలపై నిర్దిష్ట సమాచారంతో దాడి చేసినట్లు తెలిపారు.

# అఖిలపక్ష సమావేశం నేడు

న్యూఢిల్లీ : కేంద్ర ప్రభుత్వం గురువారం అఖిల పక్ష సమావేశాన్ని ఏర్పా టు చేసింది. 'ఆపరేషన్ సిందూర్' పేరుతో పాకిస్థాన్, పాక్ ఆక్రమిత కశ్మీరులలో భారత దళాలు నిర్వహించిన దాడుల గురించి నేతలకు తెలియజేయనుంది. ఈ భేటీ గురించి పార్లమెంటరీ వ్యవహారాల శాఖ మంత్రి కిరణ్ రిజిజు ఎక్స్ పోస్ట్‌లో తెలిపారు. పార్లమెంటు గ్రంథాలయ భవనంలో గురువారం ఉదయం 11 గంటలకు ఈ సమావేశం జరుగుతుందని చెప్పారు. పాకిస్థాన్‌తోపాటు, పీవోకేలో ఉన్న ఉగ్రవాద స్థావరాలను ధ్వంసం చేసేందుకు బాధ్యతాయుతంగా దాడులు నిర్వహించినట్లు కేంద్ర ప్రభుత్వం బుధవారం ప్రకటించింది.

## వార్ స్పోక్స్‌పర్సన్‌గా ఆనంద్

హైదరాబాద్ (నమస్తే తెలంగాణ): భారత్-పాకిస్థాన్ మధ్య నెలకొన్న ఉద్రిక్తతలు, ఆపరేషన్ కగార్ సంబంధిత ఏ సమాచారమైనా తెలంగాణ నుంచి అధికారికంగా వెల్లడించేందుకు సీఎం రేవంత్ హైదరాబాద్ నగర సీపీ ఆనంద్‌ను అధికారికంగా ఎంపిక చేశారు. ఏ సమాచారమైనా సీఎం తర్వాత సీపీ ఆనంద్ ఒక్కరే మాట్లాడనున్నారు.

# పహల్గాం ముష్కరులనూ మట్టుబెట్టాల్సిందే

- పాక్‌పై దాడికి ఆపరేషన్ సిందూర్ సరైన పేరు
- త్రివిధ దళాల దాడిపై పహల్గాం బాధితుల హర్షం

న్యూఢిల్లీ: పహల్గాం ఉగ్రదాడికి ప్రతీకారంగా భారత సైన్యం చేపట్టిన 'ఆపరేషన్ సిందూర్'పై బాధిత కుటుంబాల నుంచి ప్రశంసలు వెల్లువెత్తుతున్నాయి. ఏప్రిల్ 22న పహల్గాంలో జరిగిన ఉగ్రదాడిలో మొత్తం 26 మంది ప్రాణాలు కోల్పోయారు. దీనికి ప్రతీకారంగా భారత త్రివిధ దళాలు సంయుక్తంగా బుధవారం తెల్లవారుజామున పాకిస్థాన్, పాక్ ఆక్రమిత కశ్మీర్ (పీవోకే)లోని 9 ఉగ్రవాద శిబిరాలపై బాంబుల వర్షం కురిపించాయి. 'ఆపరేషన్ సిందూర్' పేరుతో నిర్వహించిన ఈ అనూహ్య దాడిపై సర్వత్రా ప్రశంసలు వెల్లువెత్తుతున్నాయి. ముఖ్యంగా పహల్గాం బాధిత కుటుంబాలు దీనిని స్వాగతించాయి. ఉగ్రదాడిలో ప్రాణాలు కోల్పోయిన వారికి నిజమైన నివాళి లభించిందంటూ సంతోషం వ్యక్తం చేశాయి.

### భారత్‌పై దాడి చేయాలంటే ఇకపై వందసార్లు ఆలోచించాలి

ఇక నుంచి భారత్‌పై దాడి చేయాలంటే ఉగ్రవాదులు ఒకటికి 100సార్లు ఆలోచించాలి. మరెవరూ ఇలాంటి దాడులకు పాల్పకుండా ప్రతీకార చర్యలు అవసరమని నేను అప్పుడే చెప్పాను. ఉగ్రవాద లక్ష్యాలపై జరిపే దాడులు వారి మనసుల్లో ఎప్పటికీ ప్రతిధ్వనిస్తూ ఉండాలి.

-రాజేశ్ నర్వాల్ (పహల్గాం దాడిలో మరణించిన లెఫ్టినెంట్ వినయ్ నర్వాల్ తండ్రి

### నా కుమారుడి త్యాగం వృథా కాలేదు

పహల్గాం ఉగ్రదాడిలో ప్రాణాలు కోల్పోయిన నా కుమారుడి త్యాగం వృథా కాకూడదని అనుకున్నాను. ప్రభుత్వం సరైన నిర్ణయం తీసుకుంటుందన్న నమ్మకం మాకు ఉండేది. మనం జరిపే దాడుల్లో అక్కడి అమాయకులకు ఏమీ కాకూడదు. కానీ, దాడికి తెగబడిన వారిని మాత్రం వదిలిపెట్టకూడదు. ప్రభుత్వం సరైన నిర్ణయమే తీసుకుంది.

-సుమతి (పహల్గాం దాడిలో మృతి చెందిన మంజునాథ్‌రావ్ తల్లి)

### నలుగురు ఉగ్రవాదులనూ మట్టుబెట్టాల్సిందే

పాకిస్థాన్‌లోని ఉగ్ర శిబిరాలపై దాడులు సరైనవే. పహల్గాం దాడికి పాల్పడిన నలుగురు ఉగ్రవాదులను కూడా మట్టుబెట్టాల్సిందే. పాకిస్థాన్‌పై దాడికి 'ఆపరేషన్ సిందూర్' అని సరైన పేరే పెట్టారు. వారు (ఉగ్రవాదులు) ఎంతోమంది మహిళల నుదిటి తిలకం (సిందూరం) తొలగించారు. కాబట్టి ఈ పేరు సరైనదే.

- జెన్నిఫర్ (ఉగ్రదాడిలో మరణించిన సుశీల్ నాథనీల్ భార్య), ఇండోర్

### పాకిస్థాన్‌ను పూర్తిగా తుడిచిపెట్టేయాలి

పాకిస్థాన్ పూర్తిగా కనుమరుగయ్యే వరకు పాకిస్థాన్‌పై దాడులు కొనసాగించాలి. పాక్‌పై భారత్ దాడి చేయడం గర్వంగా ఉంది. భారత దళాలకు సెల్యూట్ చేస్తున్నా. పాకిస్థాన్ పూర్తిగా తుడిచిపెట్టుకుపోయే వరకు దాడులు కొనసాగాలి.

- కజల్‌బెన్ పర్మార్ (పహల్గాం దాడిలో ఆమె భర్త, కుమారుడిని కోల్పోయారు), గుజరాత్

### న్యాయం జరిగినందుకు ఆనందంగా ఉంది

పహల్గాం ఉగ్రదాడికి ప్రతిగా పాకిస్థాన్, పీవోకేలోని ఉగ్ర స్థావరాలపై భారత్ దాడి చేయడం సంతోషంగా ఉంది. హిందూ, ముస్లిం పేరుతో నా భర్తతోపాటు ఎంతోమందిని ఉగ్రవాదులు కాల్చి చంపారు. ఇప్పుడా కుటుంబాలకు న్యాయం జరిగినందుకు ఆనందంగా ఉంది.

-శీతల్‌బెన్ (పహల్గాం ఉగ్రదాడిలో మరణించిన శైలేశ్ కలాతియా భార్య), సూరత్

### ప్రాణాల విలువేంటో ఇప్పుడు తెలిసొస్తుంది

'ఆపరేషన్ సిందూర్' దెబ్బకు ఉగ్రవాదులు ఇప్పుడు భయంతో బతకాలి. వారికిప్పుడు ప్రాణాల విలువేంటో తెలుస్తుంది. ఇలాంటి నిర్ణయం తీసుకున్నందుకు ప్రభుత్వానికి కృతజ్ఞతలు. దాడికి ప్రతీకారం తీర్చుకుంటామని నా భర్త మృతదేహం దగ్గరే ఆర్మీ సిబ్బంది నాకు హామీ ఇచ్చారు.

-ప్రియదర్శిని ఆచారియా (ఉగ్రదాడిలో మృతి చెందిన ప్రశాంత సత్పతి భార్య), ఒడిశా